కలెక్టర్లతో సిఎం చంద్రబాబునాయుడు నిర్వహించిన సదస్సులో పాల్గొన్న విజయనగరం జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ఉద్యమ స్ఫూర్తితో ముందుకు..

- నినదించిన సిపిఎం జిల్లా మహాసభ
- శ్రేణుల్లో సమరోత్సాహం
- ప్రజలతో మరింత మమేకమై పనిచేయాలని నేతల పిలుపు

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి /కురుపాం

సిపిఎం పార్వతీపురం మన్యం జిల్లా 10వ మహాసభలు సమరోత్సాహంతో ముగిసాయి. రెండు రోజుల పాటు జరిగిన మహాసభలో జిల్లాలోని కీలక సమస్యలపైనా, ప్రభుత్వ విధానాల వల్ల ఈ ప్రాంతంలో ఉత్పన్నమవుతున్న ఆటంకాలపైనా కీలకంగా చర్చించారు. జిల్లా, రాష్ట్ర, దేశ రాజకీయాలు-ప్రజలపై వాటి ప్రభావం తదితర అంశాలను జాతీయ, రాష్ట్ర స్థాయి నేతలు ప్రతినిధులకు వివరించారు. ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడంతో పాటు కీలక సమస్యలపైనా పోరాడాలని మహాసభ నిర్ణయించింది. జిల్లా సమగ్ర అభివృద్ధికి తగినన్ని నిధులు కేటాయించాలని సభ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. జిసిసి బలోపేతానికి, అటవీ హక్కుల చట్టం, ఉపాధి హామీ చట్టం పటిష్ట అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని, గిరిజన ప్రాంతంలో విద్య, వైద్యం, రోడ్లు తదితర సదుపాయాల మెరుగుకు ప్రభుత్వంపై పోరాడాలని మహాసభ నిర్ణయం చేసింది.

కురుపాంలోని కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్, బుద్ధదేవ్ బట్టాచార్య ప్రాంగణం, సత్యనారాయణ రాజు వేదికగా (సాయి నందకి కల్యాణ మండపం) రెండు రోజులు పాటు జరిగిన సిపిఎం పార్వతీపురం మన్యం జిల్లా మహాసభలు అత్యంత ఉత్సాహ పూరితంగా ముగిశాయి. గత మూడేళ్లలో పార్టీ చేపట్టిన ఉద్యమాలు, విస్తరణ, ముఖ్యంగా గత ఎన్నికల్లో ప్రజలు పార్టీని అభిమానించిన తీరు తెన్నులు, ప్రజలకు పార్టీ తరపున అందించిన సహకారం తదితర అంశాలను జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు తన నివేదిక ద్వారా సభకు తెలియజేశారు. వీటిపై రంగాలు, ప్రాంతాలు వారీగా ప్రతినిధులు చర్చించి తమ అభిప్రాయాలను తెలియజేశారు. వీటితోపాటు జిల్లాలోని సమస్యలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, వాటి ప్రభావం తదితర అంశాలపై చర్చించారు. పాలక పార్టీల నిర్లక్ష్యం వల్లే జిల్లా అత్యంత వెనుకబడిందని, ఈ నేపథ్యంలో పాలకులు అనుసరిస్తున్న ప్రజా కార్మిక కర్షక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించాలని సభ నిర్ణయించింది. గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలను దెబ్బతీసి, వారి మధ్య విభేదాలు సృష్టించి, తద్వారా ప్రజల నుంచి వచ్చే వ్యతిరేకతను తగ్గించుకునేందుకు ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని, దీన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత తీసుకోవాలని మహాసభ తెలిపింది. మహాసభలో 23 అంశాలపై వివిధ రంగాలకు చెందిన నాయకులు పెట్టిన తీర్మానాలను ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ప్రజా పోరాటాలకు ఎర్ర జెండా నిరంతరం అండగా నిలుస్తుందని పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ అన్నారు. ఇందుకోసం ప్రజలతో మమేకమై పనిచేయాలని సూచించారు. సభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం పార్వతీపురం మన్యం జిల్లా నూతన కమిటీతో జాతీయ, రాష్ట్ర నాయకులు పుణ్యవతి, సుబ్బరావమ్మ, తులసీదాస్, అశోక్

మాట్లాడుతున్న పుణ్యవతి

ఐక్య ఉద్యమాలకు సిద్ధం కండి : పుణ్యవతి

ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గతంలో మన్యం జిల్లాలో తోటపల్లి నిర్వాసితుల ఉద్యమం సహా అనేక పోరాటాలు స్ఫూర్తిదాయకంగా నిలిచాయని గుర్తు చేశారు. ఒకప్పుడు అనేక నిర్బంధాల నడుమ అటు పార్టీని విస్తరించడంతోపాటు ఇటు ప్రజా ఉద్యమాలను కూడా ముందుకు సాగించామని గుర్తు చేశారు. ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న నేపథ్యంలో ప్రజలను మరింత అప్రమత్తం చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చాక మతతత్వ శక్తులు పెట్రేగుతున్నాయని, తద్వారా ప్రజల మధ్య చీలికలు తెస్తున్నాయని అన్నారు. వీటిని ఎదుర్కొనేందుకు ప్రజా సమస్యలను అజెండా చేసి ప్రజలను సమీకరించడమే మార్గమని అన్నారు. స్థానిక సమస్యలపై అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి నిర్దిష్టమైన కార్యాచరణ రూపొందించి ముందుకు కదలాలని పిలుపునిచ్చారు.

వామపక్ష ఐక్యతతో ప్రజా సమస్యల పరిష్కారం

సిపిఐ జిల్లా కార్యదర్శి మన్మథరావు

వామపక్షాల ఐక్య పోరాటాలతోనే ప్రజలకు మెరుగైన భవిష్యత్తు సాధ్యమవుతుందని సిపిఐ మన్యం జిల్లా కార్యదర్శి కోరంగి మన్మథరావు అన్నారు. పార్టీలు వేరైనా సిపిఎం, సిపిఐ తదితర వామపక్ష పార్టీలు ప్రజా సమస్యలపై పోరాటం విషయంలో అంతా కలిసికట్టుగా ఉంటామని అన్నారు. పాలక పార్టీలన్నీ ఏకమై గుత్త పెట్టుబడిదారులకు సేవ చేస్తున్నాయని, దేశ సంపాద సైతం దోచిపెడుతున్నాయని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఒక్క ప్రభుత్వాలపైనే కాకుండా పాలక పార్టీలన్నింటినీ ఎండగట్టేందుకు కమ్యూనిస్టులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

సిపిఎం జిల్లా కార్యదర్శిగా కొల్లి గంగునాయుడు

19 మందితో జిల్లా కమిటీ

కొల్లి గంగునాయుడు

మహాసభలో జిల్లా నూతన కమిటీ 19 మందితో ఎన్నికైంది. వీరంతా ఆరుగురిని కార్యదర్శివర్గంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా కొల్లి గంగునాయుడు, కార్యదర్శివర్గ సభ్యులుగా ఎం.తిరుపతిరావు, కోలక అవినాష్, వి.ఇందిర, ఎన్వై నాయుడు, కె.రామస్వామి ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా కార్యదర్శి, కార్యదర్శివర్గ సభ్యులతో పాటు రెడ్డి వేణు, రెడ్డి శ్రీదేవి, డి.రమణారావు, జి.తిరుపతిరావు, ఎం.శ్రీనివాసరావు, కె.కృష్ణమోహన్, ఎం.రమణ, ఎ.భాస్కరరావు, కె.సాంబమూర్తి, పి.రాజశేఖర్, కె.ఈశ్వరరావు, బివి రమణ, జి.వెంకటరమణ, కోఆప్షన్ సభ్యుడు ఒకరున్నారు.

వి.ఇందిర

ఎం.తిరుపతిరావు

కె.అవినాష్

ఎన్వై నాయుడు

కె.రామస్వామి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

రైతు సమస్యలపై పోరుబాట

13న ర్యాలీ.. కలెక్టర్‌కు వినతి

వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రైతుల పంటలకు గిట్టు బాటు ధర కల్పించాలని, పంట ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేయాలని,రైతులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ ఈనెల 13న వైసిపి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి, కలెక్టర్‌కు వినతి ఇవ్వనున్నామని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జిశ్రీనివాసరావు తెలిపారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముందుగా గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ నేడు రాష్ట్రంలో, జిల్లాలో రైతుల పరిస్థితి అధ్వాన్నంగా ఉందన్నారు. రైతులను ఆదుకొనే పరిస్థితి లేదన్నారు. ఈ నేపథ్యంలో రైతులను ఆదుకోవాలని కోరుతూ ఈనెల 13న వైసిపి ఆధ్వర్యాన విజయనగరంలో ర్యాలీ నిర్వహించి, కలెక్టర్‌కు వినతి పత్రం అందించనున్నట్లు తెలిపారు. 27న కరెంట్ ఛార్జీల మోతపై నిరసన, జనవరి 3న విద్యార్థులకు బాసటగా నిలదీత వంటి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. వీటితో పాటు సూపర్ సిక్స్ హామీల అమలుకు డిమాండ్ చేస్తూ ఉద్యమిస్తామని తెలిపారు. సమావేశంలో వైసిపి నాయకులు కెవి సూర్య నారాయణరాజు, నెక్కల నాయుడుబాబు , జై హింద్ కుమార్, ఆశాపు వేణు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సమ్మేటివ్ ప్రశ్నపత్రాలు పాఠశాలలకు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమ్మేటివ్ ప్రశ్నాపత్రాలను పాఠశాలలకు పంపిణీ చేయాలని ఎపిటిఎఫ్ నాయకులు బుధవారం డిఇఒకు వినతినిచ్చారు. సమ్మేటివ్ పరీక్షా పత్రాలు పాఠశాలలకు పంపిణీ చేయాలని లేదా స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో నైనా ఇవ్వాలని కోరారు. ఉద్యోగ విరమణ వలన ఏర్పడిన సబ్జెక్టు టీచర్ల ఖాళీలను సర్‌ప్లస్ టీచర్లతో సర్దుబాటు చేయాలని, 10వ తరగతి వందరోజుల ప్రణాళికలో పబ్లిక్ హాలిడేస్, సంక్రాంతి సెలవుల నుండి మినహాయింపు ఇవ్వాలని కోరారు. వినతిచ్చిన వారిలో రాష్ట్ర ఉపాధ్యక్షులు డి. ఈశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వి పైడిరాజు, కార్యదర్శి ఎబి శ్రీనివాస రావు, ఉపాధ్యక్షులు ఎవిఎస్ ఎన్ మూర్తి, బి.వెంకటరమణ పాల్గొన్నారు.

ఆదివారం మినహాయింపు ఇవ్వాలి

ఎస్‌సిఇఆర్‌టి ఇచ్చిన వంద రోజులు ప్రణాళికల్లో ఆదివారం ఆదివారం మినహాయింపు ఇవ్వాలని జిల్లా విద్యా శాఖ అధికారి యు.మాణిక్యం నాయుడును జిల్లా ప్రధానోపాధ్యాయులు సంఘం గౌరవ అధ్యక్షులు కె.సత్యం,ప్రధాన కార్యదర్శి టి. సన్యాసిరాజు కోరారు. బుధవారం ఈ మేరకు డిఇఒకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం కూడా సెలవు లేకపోతే వసతి గృహ విద్యార్థులు ఇబ్బంది పడతారన్నారు. దీంతో పాటు ఎస్ఎ 1 ప్రశ్నాపత్రాలు ఉదయం, సాయంత్రం రెండు పూటలా తీసుకెళ్లే విధంగా అవకాశం కల్పించాలని కోరారు.

సంతకం చేస్తున్న లెక్చరర్స్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ జివిఎస్ జయపాలరావు

డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించాలి

పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యాన సంతకాల సేకరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా కేంద్రంలో డిగ్రీ కాలేజికి సొంత భవనం ఆర్అండ్‌బి అతిథిగృహం స్థలంలో నిర్మించాలని, ఆ ప్రాంతాన్ని విద్యాహబ్ కింద మార్చాలని, తాత్కాలికంగా పద్మావతి నగర్ 3వ రోడ్ లో ఉన్న హాస్టల్ భవన్‌లోకి డిగ్రీ కాలేజీని మార్చాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు . డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని కోరుతూ బుధవారం పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంస్కృత కళాశాల వద్ద జరిగిన సంతకాల సేకరణ కార్యక్రమాన్ని లెక్చరర్స్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ జివిఎస్ జయపాలరావు తొలి సంతకం చేసి ప్రారంభించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెంకటేష్, సిఐటియు జిల్లా కార్యదర్శి యు ఎస్ రవి కుమార్, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ , పట్టణ పౌర సంక్షేమ సంఘం నగర కార్యదర్శి వి. రామ చంద్రరావు, ప్రజా సంఘాలు నాయకులు మాట్లాడుతూ ఒకప్పుడు విద్యల నగరంగా పేరొందిన విజయనగరంలో నేడు బిఇడి, పీజీ, లా కళాశాలలను ఎత్తేశారన్నారు. శ్రీకాకుళం పట్టణంలో 10 మున్సిపల్ హై స్కూల్స్‌ఉంటే విజయనగరంలో దశాబ్దాలుగా కేవలం మూడే మున్సిపల్ స్కూల్స్ ఉన్నాయని తెలిపారు. జనాభా కనుగుణంగా మున్సిపల్ హైస్కూళ్ల కోసం శిల్పారామం వద్ద 20ఎకరాల్లో కేటాయించాలన్నారు. విద్యాభివృద్ధికి విద్యాశాఖ మంత్రి , విజయనగరం ఎంఎల్ఎ కృషి చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక ప్రకటిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అయ్యప్పనగర్ కారదర్శి సుధీర్, ఎపిఎంఎస్ ఆర్‌యు జిల్లా అధ్యక్షులు భగవాన్ , ఎస్ఎఫ్ఐ నాయకులు జగదీష్, చిన్నబాబు, డిగ్రీ కాలేజి విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ భూ సేకరణలో కుంభకోణం

- లోకాయుక్తకు ఫిర్యాదుతో సిఐడి దర్యాప్తు
- పరారీలో అక్రమార్కులు

ప్రజాశక్తి-బొబ్బిలి

వైసిపి హయాంలో జగనన్న కాలనీ కోసం జరిగిన భూసేకరణలో భూకుంభకోణం జరిగింది. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 2020లో మున్సిపాలిటీలో ఇళ్లులేని పేదల కోసం రామన్నదొరవలస సమీపంలో మల్లమ్మపేట రెవెన్యూలో ఐదుగురు గిరిజనుల నుంచి 13.21 ఎకరాల భూమిని సేకరించారు. వైసిపి అధికారంలో ఉన్న సమయంలో భూసేకరణ జరగడంతో వైసిపికి చెందిన ముఖ్యనేత భూ కుంభకోణానికి పాల్పడినట్లు అప్పటిలో ఆరోపణలు రావడంతో మల్లమ్మపేట గ్రామానికి చెందిన ఒక వ్యక్తి లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. దీంతో లోకాయుక్త స్పందించి సమగ్ర దర్యాప్తు చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో సిఐడి దర్యాప్తు చేపట్టింది. వాస్తవాలు నిర్ధారణ కావడంతో అక్రమాలకు పాల్పడిన వైసిపి నాయకులకు అరెస్టు వారెంట్ జారీ అయినట్లు చర్చ జరుగుతోంది. సిఐడి పోలీసులు ఏక్షణంలోనైనా అరెస్టు చేస్తారనే భయంతో ఆ నాయకుడు కుటుంబ సభ్యులతో సహా పరారీలో ఉన్నట్లు తెలిసింది.

జగనన్న కాలనీ కోసం సేకరించిన భూమి అంతా గిరిజనులదే

జగనన్న కాలనీ కోసం సేకరించిన 13.21ఎకరాల భూమి గిరిజనులదే. రామన్నదొరవలస గిరిజన గ్రామానికి చెందిన అరసాడ సీతమ్మ, కొర్లాపు లక్ష్మమ్మ, కొత్రు లక్ష్మణ, అరసాడ గోపమ్మ, పాదాల భారతమ్మ నుంచి ఈ భూమి సేకరించారు. ఎకరాకు నష్టపరిహారంగా అప్పటి వైసిపి ప్రభుత్వం రూ.34లక్షలు చెల్లించింది. అయితే ఈ భూములను ముందుగానే వైసిపి నాయకుడు గిరిజనుల నుంచి నామమాత్రపు ధరకు కొనుగోలు చేసుకొని తమ పేరును రాయించుకున్నట్లు తెలిసింది. అనంతరం ప్రభుత్వం భూ సేకరణ చేసి అధిక ధర చెల్లించడంతో గిరిజనులకు నామమాత్రపు ధర ఇచ్చి మిగతా మొత్తాన్ని ఆ వైసిపి నాయకుడు దిగమింగినట్లు తెలిసింది.

ఆర్‌బిఐ నిబంధనలకు విరుద్ధంగా నష్టపరిహారం విత్ డ్రా

గిరిజనులకు ప్రభుత్వం చెల్లించిన నష్టపరిహారాన్ని గిరిజనుల బ్యాంకు ఖాతా నుంచి రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా నిబంధనలను తుంగలో తొక్కి విత్ డ్రా చేశారు. అరసాడ సీతమ్మ నుంచి సేకరించిన భూమికి ప్రభుత్వం రూ. కోటి 71లక్షలు 2వేలు చెక్కును ఇచ్చింది. అప్పటి వరకు ఆమెకు బ్యాంకు ఖాతా కూడా లేకపోవడంతో వైసీపీ నేత కుటుంబ సభ్యులు పట్టణంలో ఉన్న కో-అపరేటివ్ సెంట్రల్ బ్యాంకులో 2020 నవంబర్ 10న అకౌంట్ తెరిచి చెక్కును డిపాజిట్ చేశారు. అకౌంట్ ప్రారంభించకముందే సీతమ్మతో విత్ డ్రా ఫారాలు మీద వేలిముద్రలు వేపించుకుని 2020 నవంబర్ 11న రూ. కోటి, 12న రూ.8లక్షలు, 16న రూ.15లక్షలు, 18న రూ.48లక్షలు విత్ డ్రా చేశారు. వేలిముద్ర ఉన్న విత్ డ్రా ఫారంతో రోజుకు రూ 50వేలకు మించి విత్ డ్రా ఇవ్వకూడదని ఆర్‌బిఐ నిబంధన ఉన్నప్పటికీ కో-అపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ అధికారులు పట్టించుకోకుండా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి విత్ డ్రా ఇచ్చారని విమర్శలు వస్తున్నాయి. అరసాడ సీతమ్మ దగ్గర తీసుకున్నట్లుగా మిగతా గిరిజనులు నుంచి కూడా విత్ డ్రా చేసినట్లు విమర్శలు ఉన్నాయి. గిరిజనులు తమ బ్యాంకు ఖాతా నుంచి విత్ డ్రా చేసిన కొన్ని రోజుల వ్యవధిలోనే సదరు వైసిపి నాయకుడు శ్రీకాకుళం జిల్లాలో తన కుటుంబ సభ్యులు పేరున భూములు కొనుగోలు చేసినట్లు సిఐడి పోలీసులకు ఆధారాలు లభ్యమైనట్లు తెలిసింది. దీన్ని బట్టి గిరిజనులకు రావాల్సిన డబ్బులను ఆ వైసిపి నాయకుడు ఒక పథకం ప్రకారం కొట్టేసినట్లు తెలుస్తోంది.

భూసేకరణ రికార్డులు సీజ్

జగనన్న కాలనీ భూసేకరణ రికార్డులను సిఐడి పోలీసులు సీజ్ చేశారు. బొబ్బిలి ఆర్‌డిఒ కార్యాలయానికి బుధవారం సిఐడి మహిళా కానిస్టేబుల్ చేరుకుని రికార్డులను సీజ్ చేసి విశాఖపట్నం తీసుకు వెళ్లారు. సిఐడి విచారణతో భూకుంభకోణానికి సహకరించిన రెవెన్యూ, బ్యాంక్ అధికారులలో భయం నెలకొంది.

ఆర్‌డిఒ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న సిఐడి కానిస్టేబుల్

సమావేశంలో మాట్లాడుతున్న మెప్మా పీడీ చిట్టిరాజు

పారదర్శకంగా ఎంఎస్‌ఎంఇ సర్వే

మెప్మా పీడీ చిట్టి రాజు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పట్టణ కేంద్రాల్లో ఎంఎస్ఎంఇ సర్వే పారదర్శకంగా జరిగే విధంగా సిఎంఎంలు, సిఒలు, టిఎల్ఎఫ్ గ్రూపు సభ్యులు కృషి చేయాలని మెప్మా పీడీ జివి చిట్టిరాజు అన్నారు. బుధవారం కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గ దర్శకాలకు అనుగుణంగా సర్వే జరగాలన్నారు. మెప్మా ద్వారా ఆర్థిక సహకారం పొందిన మహిళలు దేనికోసం అయితే రుణాలు తీసుకుంటున్నారో ఆ యూనిట్ తప్పని సరిగా పెట్టాలన్నారు. యూనిట్ లేకుండా ఎవరైనా రుణం తీసుకుంటే ఆ లక్ష్యం నీరుగారు తుందన్నారు. సమావేశంలో ఎఒ శ్రీనివాస్, గేదెల రాము, విజయకుమార్, సిఎంఎంలు, సిఒలు, ఆర్‌పిలు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్

398 సంఘాలకు 14న ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలోని 398 నీటిసంఘాలకు డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలకు జిల్లా ఎన్నికల అధికారి బుధవారం నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎన్నికల నోడల్ అధికారి, ఇరిగేషన్ ఇఇ ఎం.వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14న ఎన్నికలు జరుగు తాయని తెలిపారు. మండల స్థాయిలో నీటి సంఘాల ఎన్నికల కోసం ఫారం 3 ఎ, 3బి జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

మూడో రోజుకు అంగన్వాడీల దీక్షలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గజపతినగరం ప్రాజెక్టు పరిధి రామన్నపేటలో అక్రమంగా తొలగించిన అంగన్వాడీ హెల్పర్ మానాపురం సౌజన్యను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు బుధవారం మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలను యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. అనసూయ ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రామన్నపేట గ్రామ సర్పంచ్ అరుణ కుమారి చేసిన రాజకీయ వేధింపుల్లో భాగంగా సౌజన్యను తొలగించాలని ఐసిడిఎస్ పిఓ పైన ఒత్తిడి తీసుకొచ్చారన్నారు. సౌజన్యకు ఉద్యోగం ఇచ్చినప్పుడు అన్ని విధాలా ఆమె సర్టిఫికెట్లన్నీ పరిశీలించారని, అప్పుడు లేని సమస్య ఇప్పుడెందుకు వచ్చిందని ప్రశ్నించారు. స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్ మంత్రి స్పందించి సౌజన్యను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, పీడీ, సిడిపిఒలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీక్షలకు పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకర్రావు, మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహన్‌రావు, మెడికల్ సేల్స్ అండ్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి యూఎస్ రవికుమార్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుధారాణి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆర్.ఆనంద్ మాట్లాడుతూ అక్రమంగా తొలగించిన సౌజన్యకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వి.లక్ష్మి, జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు, జిల్లా కమిటీ సభ్యులు మాలతి, వరలక్ష్మి, ధనలక్ష్మి, పలువురు కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

కేరళ వామపక్ష ప్రభుత్వానికి అండగా నిలుద్దాం

సంఘీభావ సభలో ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేరళ ప్రజలకు, వామపక్ష ప్రభుత్వానికి అండగా నిలవాలని సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. కేరళ వామపక్ష ప్రభుత్వానికి సంఘీభావంగా బుధవారం జిల్లా పరిషత్ మినిస్టీరియల్ భవనంలో సభ జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కేరళలోని సిపిఎం నాయకత్వాన ఉన్న వామపక్ష ప్రభుత్వానికి అనేక ఆటంకాలు,అడ్డంకులు కల్పిస్తోందని అన్నారు. కేరళపై కేంద్ర బిజెపి ప్రభుత్వం కక్షగట్టి లక్ష కోట్లకుపైగా రావాల్సిన న్యాయమైన వాటా ఇవ్వకుండా ఆ రాష్ట్ర అభివృద్ధిని అస్థిర పరిచేందుకు కుయుక్తులు పన్నుతోందన్నారు. చట్టపరంగా రావాల్సిన నిధులు విడుదల చేయడం లేదన్నారు. దేశంలోనే అక్షరాస్యతలో అగ్రస్థానం, మహిళా సాధికారత, విద్యా, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చి, స్థానిక సంస్థలకు విధులు, నిధులు వికేంద్రీకరించి సుపరిపాలన అందించడంలో దేశంలోనే కేరళ అగ్ర స్థానంలో ఉందని అన్నారు. కేంద్ర బిజెపి గవర్నర్‌ను అడ్డం పెట్టుకుని రాష్ట్ర అసెంబ్లీ పాస్ చేసిన బిల్లులను తొక్కిపెడుతున్నారని అన్నారు. కేరళ రాష్ట్రంలో సహకార రంగాన్ని నాశనం చేయడానికి కేంద్రం కంకణం కట్టుకుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని భారత పెట్రోలియం లాంటి భారీ పరిశ్రమలను అమ్మడానికి పూనుకున్నదన్నారు. త్రివేండ్రం విమానాశ్రయాన్ని అదానీకి అప్పగించిందని, రాష్ట్రప్రభుత్వమే కొంటామన్నా రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించడానికి నిరాకరించిందని తెలిపారు. వయనాడ్ కొండ చరియలు విరిగిపడి నాలుగు వందల మంది మరణించారని, మరో వందమంది నేటికీ లభ్యం కాలేదని, తీవ్రమైన ఈ దుర్ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించలేదని అన్నారు. ఈ తీవ్రమైన కేంద్ర ప్రభుత్వ చర్యలను దేశవ్యాప్తంగా ప్రజలందరూ ఖండించాలని కోరారు. సభలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి. రాంబాబు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి. శ్రీనివాస్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్. రాములు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి, జిల్లా కార్యదర్శి ఎ. జగన్మోహన్, వి. రాములు,యూ ఎస్ రవికుమార్, సి హెచ్. ప్రకాష్, కరీం, సత్యం, రాఘువ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అభివాదం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు చంద్రశేఖర్

భౌతిక శాస్త్రంపై అవగాహన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక సిపిఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ విద్యార్థులకు భౌతిక శాస్త్రంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్రం సీనియర్ అధ్యాపకులు జోగా చంద్ర శేఖర్ రావు భౌతిక శాస్త్రంలో క్లిష్టమైన అంశాలైన తరంగాలు, కాంతి దృశ్య శాస్త్రంలోని పలు అంశాలపై ఇన్నోవేటివ్ ఎక్స్‌పెరిమెంట్స్ ఇన్ ఫిజిక్స్ వర్క్ షాప్‌లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయనకు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన, పేటెంట్ హక్కు పొందిన ప్రయోగ పరికరంతో కాంతి దృగ్విషయాలను వివరించిన విధానం విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మజ్జి సత్యనారాయణ, భౌతిక శాస్త్ర అధ్యాపకుడు కోట రవి శంకర్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎం దృష్టికి సమస్యలు

వేపాడ: మండలంలోని గ్రామీణ రహదారుల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌ను సామాజిక కార్యకర్త రెడ్డి అప్పారావు, బానాది ఎంపిటిసి గొంప తులసి కోరారు. ఈ మేరకు అమరావతిలో జరిగిన కలెక్టర్ల సమావేశంలో బుధవారం ఆయన మంత్రులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆతవ నుంచి బానాది, సింగరాయ నుంచి ఆతవ, చిందలూరు, ఎస్.పేట నుంచి కొండగుంపు గ్రామాలకు అవసరమైన రహదారుల నిర్మాణాలు ప్రతిపాదనలకు అనుగుణంగా నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం అక్కడే విజయనగరం కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను కలిసి వసతి గృహాలలో సమస్యలను స్వయంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. అనంతరం సమస్యలపై వినతి పత్రాలను అందించామని అప్పారావు చెప్పారు.

సోంపురం ఉన్నత పాఠశాల సందర్శన

వేపాడ: మండలంలోని సోంపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను ఎంఇఒ పి. బాలభాస్కరరావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా తెలుగు పరీక్షను పరిశీలించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిహెచ్ రాజు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

14న నీటి సంఘాల ఎన్నిక

నెల్లిమర్ల: సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్‌ను అధికారులు విడుదల చేశారు. బుధవారం కొత్తపేట ప్రాథమిక పాఠశాలలో నోటీస్ బోర్డుపై ఎన్నికల నిర్వహణ సిబ్బంది, ఆయకట్టుదారులు, గ్రామస్థుల సమక్షంలో ఎన్నికల అధికారి వివిఆర్ జగన్నాథరావు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14న నీటి సంఘాల ఎన్నిక జరగనున్నట్లు ఆయన తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

శృంగవరపుకోట: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లీడ్ బ్యాంక్ మేనేజర్ వివి వెంకట రమణమూర్తి తెలిపారు. పట్టణంలోని శాఖ గ్రంథాలయానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, విజయనగరం లీడ్ బ్యాంక్ ద్వారా ఆయన సైబర్ నేరాలపై అవగాహన కల్పించే పుస్తకాలను బుధవారం ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి దామోదర శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మానవహక్కుల పరిరక్షణతోనే వికాసం

బొబ్బిలి: మానవ హక్కుల పరిరక్షణతోనే మానవ వికాసం, భవిష్యత్ ఆధారపడివుందని రోటరీ క్లబ్, కరుణ్య సంస్థ చైర్మన్ జెసి రాజు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కళాశాల బాలుర వసతి గృహంలో మానవ హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని రోటరీ క్లబ్ అధ్యక్షులు శ్రీనివాసన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ నేపథ్యంలో జెసి రాజు మాట్లాడుతూ మన హక్కులేమి, మన భవిష్యత్ అని వాటిని కాపాడుకోవాలని అన్నారు. ప్రతి మనిషి జీవించే హక్కు, చదువుకొనే హక్కు, ప్రశాంతంగా పొందే హక్కు, ప్రేమను పొందే హక్కు, భావ స్వాతంత్య్రపు హక్కు, వివాహం చేసుకొనే హక్కు, భద్రత, సంరక్షణ, స్వేచ్ఛను కలిగి ఉండే హక్కులు కలిగి ఉన్నారన్నారు. మానవ హక్కులపై విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలన్నారు.

ఎండిఎం నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలి

భోగాపురం: మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంఇఒ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకుడు బి సూర్యనారాయణ మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా బిల్లులు పెంచాలన్నారు. వర్కర్లకు, ఆయాలకు రూ.15వేలు జీతంతో పాటు ప్రమాద బీమా, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన సరుకులను పౌర సరఫరాల ద్వారా పంపిణీ చేయాలన్నారు. అనంతరం ఎంఇఒలు ఎ.రమణమూర్తి, బాలివల్లి చంద్రమౌళికి సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు యశోద రమణ, కనకల ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నందిగాంలో పశువైద్య శిబిరం

భోగాపురం: మండలంలోని నందిగాంలో ఉచిత గర్భకోస వ్యాధుల చికిత్స శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వైవి రమణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గరే మురళి, పశువైద్యాధికారులు రామరాజు, కమల కుమారి, కూటమి నాయకులు లోకం ప్రసాద్, వెంకటరమణ, పల్లంట్ల జగదీష్, బొల్లు త్రినాథ్ పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థికి ల్యాప్‌టాప్

విజయనగరంకోట : విభిన్న ప్రతిభా వంతుల శాఖ ఆధ్వర్యంలో మెంటాడ మండలం ఆగూరుకు విభిన్న ప్రతిభావంతురాలైన విద్యార్థిని గొర్లె నిఖితకు ఉచితంగా ల్యాప్ టాప్ అందజేశారు. రూ.40 వేల విలువ చేసే ల్యాప్‌టాప్‌ను జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి డి.రమేష్ చేతుల మీదుగా బుధవారం అందజేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభా వంతుల శాఖ సిబ్బంది ఈశ్వర రావు, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్విప్ ప్రోగ్రామ్‌లో సీతం ఫ్యాకల్టీ ప్రతిభ

విజయనగరం: స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ అయిన ఎం. భార్గవి, 'ఎఐ అప్లికేషన్స్'పై ఎఐసిటిఇ క్విప్ పిజి సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ మార్గదర్శక కార్యక్రమాన్ని ఐఐటి ఖరగ్‌పూర్‌లోని కంప్యూటర్ సైన్స్,నీరింగ్ విభాగం జూలై నుండి నవంబర్ 2024 వరకు నిర్వహించింది. ఖరగ్‌పూర్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో భార్గవికి సర్టిఫికెట్‌ను ప్రొఫెసర్ టి.జి. సీతారాం, ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ చైర్మన్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమెను కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు అభినందించారు. వివిధ రంగాల్లో రాణించేందుకు కషి చేసే అధ్యాపకులకు, నిపుణులకు భార్గవి రోల్ మోడల్‌గా నిలుస్తారని అన్నారు.

సీనియర్ సహాయకులకు ఉద్యోగోన్నతి

విజయనగరం టౌన్ : జిల్లా పరిషత్తు చైర్మన్ ఛాంబర్‌లో పనిచేస్తున్న ఇద్దరు జూనియర్ సహాయకులు కె.విజయను ఇఇ ట్రైబల్ వెల్ఫేర్ కార్యాలయంలో సీనియరు సహాయకులుగా, ఎం. నవీన్ కుమార్‌ను కురుపాం మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ సహాయకులుగా ఉద్యోగోన్నతులు కల్పిస్తూ జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ బివివి సత్యనార్యాణ, పంచాయతీరాజ్ ఉద్యోగల సంఘం నాయకులు మురళి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై కొరడా

విజయనగరం టౌన్ : భవన నిర్మాణ అనుమతుల క్షేత్రస్థాయి పరిశీలన తప్పనిసరిగా చేపట్టాలని ప్రణాళిక అధికారులకు, సిబ్బందికి నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య ఆదేశించారు. ఈనేపథ్యంలో బుధవారం అయ్యన్నపేట, అయ్యప్ప నగర్ పూల్ బాగ్ ప్రాంతాలలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి, ప్రణాళిక సిబ్బందితో వెళ్లి అక్కడ భవన నిర్మాణ అనుమతులపై వచ్చిన దరఖాస్తును, వాటి వివరాలను నమోదు చేసుకున్నారు. హద్దులు, ఇతర అంశాలను గమనించారు. తోట పాలెం ప్రాంతంలో నిబంధనలు అతిక్రమించి భవనాన్ని నిర్మిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదుపై అధికారులు స్పందించి పరిశీలించారు. అయితే ఆ భవనానికి అన్ని అనుమతులూ ఉండడంతో అధికారులు అవాక్కయ్యారు. చివరికి భవనం చుట్టూ ఉన్న సెట్‌బ్యాక్స్ నిబంధనల ప్రకారం లేవంటూ ఆ గోడలను తొలగించారు. నగరంలో అనేక చోట్ల ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లను సిబ్బంది తొలగించారు.

నాసిరకం వస్తువుల పంపిణీపై విచారణ

- రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీ
- కార్యాలయంలోనూ మూడు రోజుల పాటు విచారించిన అధికారులు
- వస్తువుల రికార్డులను తీసుకెళ్లిన ఆర్‌జెడి
- ఇటీవల బదిలీపై వెళ్లిన సిడిపిఒపై ఆరోపణలు

ప్రజాశక్తి - భోగాపురం

అంగన్‌వాడీ కేంద్రాలకు గతేడాది నాసిరకం వస్తువులు ఇచ్చారనే ఆరోపణలపై ఫిర్యాదు చేయడంతో అధికారులు ఇటీవలి విచారణకు ఆదేశించారు. ఈ విషయంలో ఇటీవలి పనిచేసి బదిలీపై వెళ్ళిన సిడిపిఒ హస్తం ఉన్నట్లు ఫిర్యాదు వెళ్లడంతో గత నెల 22న ఆర్‌జెడి వచ్చి రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీ చేశారు. ఈ వస్తువులు కొనుగోలుకు సంబంధించిన వివిధ రికార్డులను తనిఖీల నిమిత్త విశాఖలోని ఆర్‌జెడి కార్యాలయానికి తీసుకువెళ్ళారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో చర్చనీయాంశమైంది.

భోగాపురం ఐసిడిఎస్ పరిధిలో భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ మండలాల్లో పెద్ద అంగన్‌వాడీ కేంద్రాలు 210, మినీ కేంద్రాలు 62 ఉన్నాయి. వీటికి ప్రతి ఏడాది వివిధ వస్తువుల కొనుగోలుకు ప్రభుత్వం సుమారు 4లక్షల 80వేలు రూపాయలు నిధులను విడుదల చేస్తుంది. ఇందులో మినీ అంగన్‌వాడీలకు వెయ్యి రూపాయలు, పెద్ద అంగన్ వాడీలకు 2వేలు చొప్పున విడుదల చేస్తుంటారు. ఈ సొమ్ముతో అంగన్‌వాడీ కేంద్రాలకు ప్లాస్టిక్ బకెట్లు, చీపుర్లు, జంబుఖానాలు, మగ్గులు, ఫినాయిల్, సబ్బులు వంటివి జిల్లా కొనుగోలు కమిటీ నిర్ణయించిన క్వాలిటీతో కొనుగోలు చేయాలి. కానీ గతేడాది కొనుగోలు చేసిన వస్తువులు నాసిరకంగా ఉన్నట్లు ఓ వ్యక్తి గుర్తించారు. బకెట్లును పేరులేని కంపెనీవి కొనుగోలు చేసినట్లు గుర్తించారు. పైగా ఇవి ఇచ్చిన ఆరు నెలలకే విరిగిపోయినట్లు చెబుతున్నారు. గిన్నెలు తోముకునే విమ్ సబ్బులు ఒక్కో కేంద్రానికి 20రుపాయలు విలువైనవి రెండు ఇవ్వాలి. కాని 10 రూపాయలు విలువైనవి ఇచ్చారు. ఇలాంటి అక్రమాలు ఎన్నో జరిగినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఫిర్యాదు వెళ్ళింది.

విచారణకు ఆదేశించిన ఉన్నతాధికారులు

నాసిరకం వస్తువులు ఇచ్చారని తెలుసుకున్న ఒక వ్యక్తి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే అధికార యంత్రాంగం దీనిపై రంగంలోకి దిగింది. గతనెల 22వ తేదీన ఆర్‌జెడి చిన్మయి వచ్చి భోగాపురం, ముంజేరు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి ఇచ్చిన వస్తువుల నాణ్యతను

ఓ అంగన్‌వాడీ కేంద్రంలో విరిగిపోయిన బకెట్లు

పరిశీలించారు. అనంతరం కొంతమంది సిబ్బంది వచ్చి మూడు రోజులు పాటు భోగాపురం కార్యలయంలో ఈ వస్తువులు కొనుగోలకు సంబంధించిన బిల్లులు, రికార్డులను పరిశీలించారు. అనంతరం వీటిలో కొన్ని రికార్డులను ఏకంగా ఆర్‌జెడి కార్యాలయానికి తీసుకువెళ్ళారు.

సిడిపిఒ, ఎసిడిపిఒలను బదిలీ చేసిన అధికారులు

ఈ విచారణ జరిగిన అనంతరం ఇద్దరిని ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఆరోపణలు వచ్చిన సిడిపిఒ ఎస్తేరు రాణికి ఏకంగా అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరుకు బదిలీ చేశారు. ఎసిడిసిఒ తవిటినాయుడుకు విజయనగరం బదిలీ చేశారు. వీరిద్దరి మధ్య గత కొన్ని రోజులు నుంచి విభేదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

శారదకు జాతీయ మహిళా ఐకాన్ అవార్డు

బొబ్బిలి: ప్రపంచ మానవ హక్కుల మండలి ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోలో జరిగిన భారత్ గౌరవ్ అవార్డు 2024 కార్యక్రమంలో బొబ్బిలికి చెందిన అభ్యుదయ సేవా సంస్థ అధ్యక్షులు, దక్షిణ భారత మహిళా సెల్ అధ్యక్షులు డాక్టర్ చింత శారద అవార్డు అందుకున్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా లక్నోలో గల ఇంటర్నేషనల్ బౌద్ శోధ్ ఇనిస్టిట్యూట్ వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో చింత శారద, దక్షిణ భారత ప్రధాన కార్యదర్శి సాయి కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉత్తరప్రదేశ్ ఉపముఖ్యమంత్రి బ్రిజేష్ పతక్ పాల్గొన్నారు. ప్రత్యేక అతిథిగా కేబినెట్ మంత్రి జైవీర్ సింగ్, కెజిఎంయు విసి డాక్టర్ సోనియా నిత్యానంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మానవ హక్కుల మండలి ద్వారా చేస్తున్న సేవలకు గాను ఉపముఖ్యమంత్రి బ్రిజేష్ పథక్ చేతుల మీదుగా డాక్టర్ చింత శారదకు జాతీయ ఉమెన్ ఐకాన్ అవార్డును, దక్షిణ భారత ప్రధాన కార్యదర్శి సాయి కుమార్‌కు జాతీయ సాధకుల అవార్డును అందజేశారు. తమకు అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, కార్యక్రమ నిర్వాహకుడు, మానవ హక్కుల మండలి జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎంఆర్ అన్సారికు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు.

సూపర్ సిక్స్ అమల్లో కూటమి విఫలం

మాజీ ఎమ్మెల్యేలు బొత్స, శంబంగి

ప్రజాశక్తి- గజపతినగరం

సూపర్ సిక్స్ అంటూ అబద్దపు హామీలతో కూడిన మేనిఫెస్టోతో అన్ని వర్గాల ప్రజలను కూటమి ప్రభుత్వం మోసం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు ఎరువులు దగ్గర నుంచి ధాన్యం సేకరణ వరకు అన్ని తమ ప్రభుత్వంలో అందించే వాళ్ళమని కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులను పట్టించుకునే నాధుడే లేడని విమర్శించారు. ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి అమ్మకు వందనం ఇస్తానన్న హామీ ఏమైందని ప్రశ్నించారు? అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచనంటూ గొంతు చించుకొని చెప్పిన కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల కాలంలోనే ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం మోపిందని అన్నారు. వీటిపై డిసెంబర్ 13, 27 తేదీలలో జిల్లా కలెక్టర్‌కు, జిల్లా విద్యుత్ అధికారికి వినతిపత్రం ఇస్తామన్నారు. జనవరి 3న కూటమి ప్రభుత్వం వైఫల్యాలపై జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని జెడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచులు, నాయకులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. అనంతరం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సమావేశంలో మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కరణం ఆదినారాయణ, సర్పంచులు బెల్లాన త్రినాధరావు, కె.పైడుపునాయుడు, పాండ్రంకి సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

బొబ్బిలి : రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆయా హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు విమర్శించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నా హామీలు అమలు చేయడం లేదన్నారు. పింఛను పెంపు మాత్రమే అమలు చేసి తల్లికి వందనం, ఫీజు రీయంబర్స్ మెంట్, రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయలేదన్నారు. కూటమిని గెలిపిస్తే విద్యుత్ ఛార్జీలు పెంచమని చెప్పి ఆరు నెలలలో రెండు సార్లు పెంచడం అన్యాయమన్నారు. రైతు భరోసా రూ.20వేలు ఇస్తామని చెప్పి ఇవ్వడం లేదన్నారు. అధిక వర్షాలు వల్ల, వర్షాలు లేకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో పంటలు పండ లేదని అటువంటి వారికి పంట నష్టపరిహారం కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో ఆలస్యం చేయడంతో వ్యాపారులు, దళారీలకు రైతులు అమ్ముకుని మోసపోతున్నారని చెప్పారు. 48గంటల్లో బిల్లులు చెల్లిస్తామని చెప్పిన ప్రభుత్వం తాను ధాన్యం ఇచ్చిన మూడు రోజులు వరకు ట్రక్ షీట్ జనరేట్ చేయలేదన్నారు. బిల్లులు కూడా సకాలంలో ఇవ్వడం లేదన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, సబ్సిడీపై వ్యవసాయ పని మెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు ఆపాలని, విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరారు. తల్లికి వందనం అమలు చేయకపోవడంతో పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఫీజు రీయంబర్స్ మెంట్ ఇవ్వకపోవడంతో హాల్ టికెట్లు ఇవ్వడం లేదని అన్నారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని, రైతాంగ సమస్యలను పరిష్కరించాలని ఈనెల 13న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. ఈనెల 27న విద్యుత్ చార్జీలను తగ్గించాలని నిరసన తెలుపు తామని చెప్పారు. ఆయనతో పాటు వైసిపి నాయకులు శంబంగి వేణుగోపాల నాయుడు, తూముల రామసుధీర్, బాడంగి జెడ్‌పిటిసి పి.రామారావు తదితరులున్నారు.

మాట్లాడుతున్న రూరల్ సిఐ నారాయణరావు

వ్యసనాల నుంచి విముక్తి పొందాలి

ప్రజాశక్తి - రామభద్రపురం

ప్రతీ వ్యక్తి సంకల్ప బలంతో వ్యసనాల మహమ్మారి నుంచి విముక్తి పొందాలని బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు సూచించారు. స్థానిక గ్లోబల్ స్కూల్లో బుధవారం విద్యార్థులకు జిల్లా ఎస్పి అమలు చేస్తున్న సంకల్పం లక్ష్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వ్యసనాల బారిన పడిన కుటుంబ దీన గాథలు, సమాజంలో వారికి కలిగే దుష్ఫలితాలను తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో మాదకద్రవ్య వినియోగం పెరిగిందని, చెడు వ్యసనాల పట్ల యువత ఆకర్శితులవుతున్నారని దీనిని రూపుమాపేందుకు విద్యార్థులు ముందడుగు వేయాలని పిలుపు నిచ్చారు. రహదారి భద్రతా నియమాలు పాటించాలన్నారు. బాలికలు, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సైబర్ నేరగాళ్లు చెలరేగిపోతున్నారనీ వీరి ఆగడాలు అప్రమత్తతో నివారించుకొనే పద్ధతులు వివరించారు. మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు కృషి చేస్తామని విద్యార్థి, ఉపాధ్యాయ బృందంతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ చంద్రమోహన్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

జామికి రాజకీయ గ్రహణం

- మండలంలో ప్రభుత్వ స్థలాలు లేవట..!
- నాయకుల స్వార్థాలకు అభివృద్ధి దూరం
- మోడల్ స్కూల్ నిర్మాణంపై అయోమయం

ప్రజాశక్తి - జామి

జామికి రాజకీయ గ్రహణం పట్టుకుంది. రాజకీయ నాయకుల స్వార్థాల కోసం జామి అభివృద్ధిని గాలికొదిలేస్తున్న పరిస్థితి నెలకొంది. ప్రజా సమస్యలు ఎలాగో పట్టించుకోరు, కనీసం ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులు కూడా ఇక్కడ ఏ ఒక్కటీ అమలు కావడంలేదు. మోడల్ స్కూల్ నిర్మాణమే అందుకు నిదర్శనం. గత కొన్నేళ్లుగా మండలంలో మోడల్ స్కూల్ నిర్మాణంపై చర్చ జరుగుతూనే ఉంది. గత టిడిపి హయాంలో మోడల్ స్కూల్ నిర్మాణం కోసం అటు సీనియర్ టిడిపి నాయకులు లగుడు సింహాద్రి, అప్పట్లో జామి జెడ్‌పిటిసిగా ఉన్న బండారు పెదబాబు పోటీ పడ్డారు. అలమండలో నిర్మిస్తామని ఆయన, మండల కేంద్రంలోనే ఉండాలని జామి నాయకులు అన్నారు. కానీ జామిలో స్థలం చూపించడంలో స్థానిక నాయకులు చతికల పడి, అప్పట్లో మోడల్ స్కూల్ నిర్మాణం ప్రశ్నార్థకం చేశారు. అంతకు ముందు కెజిబివి పాఠశాల విషయంలోనూ జామి నాయకులు స్వార్థాలకు పోయారు. జామి క్వారీల చుట్టూ స్థలాలు ఉన్నప్పటికీ క్వారీ కాంట్రాక్టులతో కుమ్మక్కయి, కేజీబివిని కుమారంకు వదిలేశారు. నేడు కూడా అదే పరిస్థితి. క్వారీలు చుట్టూ మోడల్ స్కూల్ నిర్మాణానికి కావాల్సిన ప్రభుత్వ స్థలం ఉంది. కానీ నాయకులు క్వారీ యజమానులతో చేతులు కలిపి స్థలం లేదన్న బూచిని జనానికి చూపిస్తున్నారు. గతంలో క్వారీలపై కొంత వరకు జనం ఉపాధి కోసం ఆధారపడేవారు. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. కార్మికులకు క్వారీల్లో పనులే లేవు. మరోవైపు ఒకటి, రెండు క్వారీలకు తప్ప మిగిలిన వాటికి ప్రభుత్వ అనుమతులే లేవు. కానీ నేడు కూడా స్థలం లేదని చెప్పి, అభివృద్ధిని స్వార్థాలకు తాకట్టు పెడుతున్నారు. మరోవైపు నాయకులే ప్రభుత్వ చెరువులను కప్పేసి, దర్జాగా అనుభవిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు అటు క్వారీల చుట్టూ ఉన్న ప్రభుత్వ స్థలాలు, అక్రమణలపై దృష్టి సారించాలి. అలా కాకుండా అధికారంలో ఉన్న నాయకులు మాటలు విని స్థలాలు లేవని చెప్పడం విడ్డూరమని జనం చర్చించుకుంటున్నారు. ఇక జామి శ్మశాన స్థలం విషయానికొస్తే, మన రాజకీయ నాయకుల బండారం ఇట్టే బయటపడుతోంది. ఏ చిన్న గ్రామం వెళ్లినా, గ్రామం శివారున ఉన్న శ్మశానం ఎంతో అభివృద్ధి చేసుకున్న పరిస్థితి. కానీ 16 వేలకు పైగా జనం నివసిస్తున్న జామికి మాత్రం శ్మశాన స్థలమే కరువు అంటే, రాజకీయ నాయకులు ఏం చేస్తున్నారో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా రాజకీయ స్వార్థాలు, కుమ్మక్కులు వీడి కనీసం మోడల్ స్కూల్‌ను ఈ సారైనా సాధిస్తారని ప్రజలు ఆశిస్తున్నారు.

నిరుపేదలకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - సంతకవిటి

మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చిరంజీవి

గ్రామ సంఘాలలో లేని పేదలను సంఘాలలో చేర్పించాలని డిఆర్‌డిఎ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎ. చిరంజీవి అన్నారు. మోడల్ మండల సమాఖ్య వ్యూహం అమలులో భాగంగా విజన్ బిల్డింగ్ పై శిక్షణ ప్రారంభమైందని ఆయన తెలిపారు. వెలుగు మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం ఆఫీస్ బేరర్స్ సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఎల్‌ఎమ్ కింద మోడల్ మండల సమాఖ్య వ్యూహం గత రెండు సంవత్సరాల నుంచి అమలు చేస్తున్నామన్నారు. మోడల్ మండల సమాఖ్యలన్నీ స్వయం యాజమాన్యం కలిగి, వారి పరిపాలన ఖర్చులు, ఆదాయం నుంచి మాత్రమే భరించాలన్నారు. గ్రామ సంఘాలలో లేని పేద, నిరుపేదలందరినీ చేర్పించి, వారికి కావలసిన అన్ని సేవలను, లబ్దిని అందించడంలో ప్రాధాన్యత ఇవ్వాలని వివరించారు. వెలుగు ప్రాజెక్ట్ 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మొదటి దశ నుంచి సభ్యులు ఇప్పటి వరకు తీసుకున్న అన్ని రకాల రుణాలు ద్వారా ఏర్పాటు చేసుకున్న జీవనోపాధి, ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలపై సంవత్సరానికి ఎంత ఆదాయం వస్తుంది, ఖర్చులు పోను ఎంత మిగులు వంటి వివరాలు, ఎస్‌హెచ్‌జి రాబడిని ప్రొఫైల్ సర్వే యాప్‌లో పొందుపరచాలని సూచించారు. ఈ మూడు రోజుల శిక్షణలో సెర్ప్ ప్రాజెక్ట్ కార్యక్రమాల అమలు, విద్య, ఉపాధి, ఆదాయ వనరులు ఏర్పాటులో అవసరమైన ప్రణాళికలు తయారు చేసుకొని, సమాఖ్యలు ఉపాధి అవకాశాలను సృష్టించుకొని వ్యాపార వేత్తలుగా మారాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎంలు టి.సీతారాం, టి.దదికుమార్, కె.హేమలత పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రైలు కింద పడి యువకుడు మృతి

ప్రజాశక్తి-చీపురుపల్లి

రైలు కింద పడి ఇప్పిలి జగదీష్ (23) అనే యువకుడు మృతి చెందాడు. బుధవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. చీపురుపల్లి పట్టణానికి చెందిన ఇప్పిలి వెంకట రమణ చీపురుపల్లిలో చిన్న పాన్‌షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తండ్రికి పాన్‌షాపులో సాయం చేస్తూ మంగళవారం రాత్రి బయటకు వెళ్లి వస్తానని జగదీష్ కుటుంబ సభ్యులకు తెలిపాడు. బయటకు వెళ్లిన తన కుమారుడు ఎంత సేపటికీ ఇంటికి రాకపోయేసరికి చుట్టు పక్కల వెతికారు. ఈ క్రమంలో రాత్రి 8 గంటల సమయంలో చీపురుపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలపై జగదీష్ శవమై కనిపించాడని తల్లిదండ్రులు తెలిపారు. కాగా జగదీష్ గత కొంత కాలంగా బ్రెయిన్ ట్యూమర్‌తో బాధ పడుతున్నట్లు మృతుడు తండ్రి తెలిపాడు. అప్పటి నుండి ఆసుపత్రికి తీసుకు వెళ్లి వైద్యం అందిస్తున్నప్పటికీ విపరీతమైన తల నొప్పితో మానసికంగా ఇబ్బంది పడుతున్నాడని చెప్పారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

రేషన్‌షాపు డీలర్ల భర్తీకి నోటిఫికేషన్

ప్రజాశక్తి- బొబ్బిలి

బొబ్బిలి రెవెన్యూ డివిజన్ పరిధిలో 30 రేషన్ షాపు డీలర్ల భర్తీకి ఆర్‌డిఒ రామ్మోహనరావు నోటిఫికేషన్ జారీ చేశారు. వివిధ కారణాలతో ఖాళీ అయిన 23 రేషన్ షాపులకు, నూతనంగా ఏర్పాటు చేసిన 7 రేషన్ షాపులకు డీలర్లను నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. బొబ్బిలి మండలంలో 8, బాడంగిలో 4, తెర్లాంలో 5, దత్తిరాజేరులో ఒకటి, గజపతినగరంలో 9, మెంటాడలో 3 షాపులకు డీలర్లను నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన వారు లేకపోతే ఫెయిల్ అయిన వారిని అర్హులుగా గుర్తించి మార్కులు మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తామన్నారు. 18 ఏళ్ల నిండి 40 ఏళ్ల లోపు వయస్సు ఉండి స్థానికులై ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. వికలాంగులు ఆయా మండలంలో నివసించిన వారై ఉండాలని చెప్పారు. సరుకులు విడిపించే ఆర్థిక స్తోమత ఉండి, కుటుంబ సభ్యులలో ఎవరికి కిరాణా వ్యాపారం ఉండకూడదన్నారు. రాజకీయ పదవులు ఉన్న అభ్యర్థులు, కేసులు ఉన్నవారు అర్హులు కాదన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 11 నుంచి 28 వరకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. 19న దరఖాస్తులు పరిశీలించి 20న అర్హులు జాబితా ప్రకటించి, 26న రాత పరీక్ష, 28న ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు. 30న డీలర్లను ప్రకటిస్తామని చెప్పారు. 80 మార్కులకు రాత పరీక్ష, 20మార్కులకు ఇంటర్వ్యూ ఉంటుందన్నారు.

నోటిఫికేషన్ జారీ చేస్తున్న ఆర్‌డిఒ రామ్మోహనరావు

భూ సమస్యల పరిష్కారమే ధ్యేయం

బొండపల్లి: రైతులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ దాట్ల కీర్తి

ప్రజాశక్తి- బొండపల్లి

భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టిందని ఆర్‌డిఒ దాట్ల కీర్తి అన్నారు. బుధవారం మండలంలోని కిండాం, అగ్రహారంలలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో రైతులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. గ్రామాలలో పరిష్కారం కాని భూ సమస్యలకు ప్రభుత్వ పరిష్కారం చూపేందుకు కృషి చేస్తుందన్నారు. రైతు సదస్సులకు హాజరై తమ సమస్యలను అర్జీల రూపంలో ఇవ్వాలని ఆమె కోరారు. 45 రోజుల లోగా అర్జీల రూపంలో వచ్చిన సమస్యలను పరిస్కరించేదుకు కృషి చేస్తామని అన్నారు. తహశీల్దార్ రాజేశ్వరరావు మాట్లాడుతు రైతులు అర్జీల ఇచ్చేటప్పుడు సంబదిత భూ దస్త్రాలను జత చేయాలను స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుంగ దేవుడు, ఆర్‌ఐ హరికృష్ణ, విఆర్‌ఒ కె.దుర్గ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి: ఎమ్మెల్సీ

శృంగవరపుకోట: గ్రామాలలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను రైతులు వినియోగించుకోవాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. మండలంలోని చినకండెపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు తమ భూములకు సంబంధించి రికార్డులలో ఉన్న తప్పులను సరిచేసుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అరుణకుమారి, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని జాకేరు గ్రామంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించామని తహశీల్దార్ రాములమ్మ తెలిపారు. గ్రామానికి చెందిన ఈరోతు వెంకటరావు ఆధార సీడింగ్ చేయమని అర్జీ పెడితే వెంటనే చేయించామన్నారు. అడపా ఈశ్వరమ్మ డిఎస్ పెట్టలేదని అర్జీ పెడితే వెంటనే పరిష్కరించినట్లు ఆమె తెలిపారు.

భోగాపురం: విమానాశ్రయ నిర్మాణంలో గ్రామాన్ని ఖాళీ చేసిన నిర్వాసితుల్లో ఎస్‌సి, ఎస్‌టి, యాత కులస్తులకు అదనంగా 50 వేల రూపాయలు ఇస్తామని చెప్పి ఇవ్వలేదని నిర్వాసితులు రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేశారు. గూడెపువలస గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రెల్లిపేటకు చెందిన నిర్వాసితులు మాట్లాడుతూ గత ప్రభుత్వం జీవోతో సహా ప్రకటించినప్పటికీ నేటికీ ఇవ్వలేదన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని తహశీల్దార్ ఎం సురేష్ తెలిపారు. అనంతరం వివిధ భూముల సమస్యలపై రైతులు ఫిర్యాదు చేశారు. ప్రత్యేక అధికారి సుధారాణి, సర్పంచ్ మట్ట అయ్యప్ప రెడ్డి, ఆర్‌ఐ షేక్ ఇమ్రాన్, నాయకులు దల్లి రామారావు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో వినతులు స్వీకరణ

విజయనగరం టౌన్ : నగరంలోని ధర్మపురిలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య, తహశీల్దార్ కూర్మనాధ్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతీఒక్కరూ తమ భూముల రికార్డులను ఒకసారి పరిశీలించుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న భూసమస్యలను శాశ్వతంగా పరిష్కరించడానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని తెలిపారు.

చెరువులను పరిరక్షించుకోవాలి

చెరువులను పరిరక్షించుకోవాల్సిన అవసరం అందరి పైన ఉందని కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. నగరంలోని పుల్‌బాగ్ ప్రాంతంలో ఉన్న బ్రాహ్మణ చెరువులో వ్యర్థాలు ఉండడాన్ని గమనించిన కమిషనర్ తక్షణమే చెరువును పరిశుభ్రపరచాలని సిబ్బందికి ఆదేశించారు. దీంతో పారిశుధ్య పర్యవేక్షకుడు బాలకృష్ణ నేతృత్వంలో బృందం జెసిబిలు సహాయంతో చెత్తాచెదారాలను తొలగించారు.